క్లుప్తంగా

13న వేతనంతో కూడిన సెలవు ప్రకటించాలి

కాశీబుగ్గ: వచ్చేనెల 13వ తేదీన జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటు వేయడానికి వీలుగా కార్మికులకు వేతనంతో కూడిన సెలవును ప్రకటించాలని పలాస అసిస్టెంట్ లేబరు ఆఫీసర్ ఎం. విజయకుమార్ వ్యాపార, వాణిజ్యరంగాలు, పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్మికశాఖ కమిషన్ ఆదేశాలు పాటించని యజమానులపై జరిమానాతో కూడిన చర్యలు ఉంటాయన్నారు.

ఉప సర్పంచ్ మృతికి సంతాపం


నర్తు తేజయ్య (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నర్తు తేజయ్య (65) శనివారం మధ్యాహ్నం ఆకస్మికంగా మృతి చెందారు. బుడ్డేపుపేటకు చెందిన ఈయన మృతిపై సర్పంచ్ పిట్ట శశిరేఖ, ఎంపీపీ బోర పుష్ప, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ సంతాపం తెలియజేశారు.

వివాహానికి ఆర్థిక సాయం


సాయాన్ని అందజేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ పుణ్యవతి

సంతబొమ్మాళి: ఆకాశలక్కవరం గ్రామానికి చెందిన తుంగాన ఉష కుమార్తెకు వివాహం నిశ్చయమైంది. అయితే ఈమెది నిరుపేద కుటుంబం. ఉషకు భర్తలేరు. సొంత ఇల్లు సైతం లేదు. ఈ విషయం తెలుసుకున్న పలువురు ఆర్థికసాయం చేసి ఆదర్శంగా నిలిచారు. ఆకాశలక్కవరం పంచాయతీకి చెందిన 44 డ్వాక్రా సంఘాల సభ్యులు రూ. 55 వేలు, ఏఎంసీ చైర్‌పర్సన్ సుగ్గు పుణ్యవతి రూ. ఐదు వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఉషకు శనివారం అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ సుగ్గు పుణ్యవతి, డ్వాక్రా సంఘ అధ్యక్షురాలు కుమారి, నీలవేణి, ఈశ్వరమ్మ ఉన్నారు.

అనాథలకు భోజనాలు వితరణ


భోజన వితరణ చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కోసంగిపురం కూడలిలోని లలితాశ్రమం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆశ్రమంలో ఉన్నటువంటి అనాథులు, వృద్ధులకు కాశీబుగ్గకు చెందిన జోగ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు భోజనాలు సమకూర్చారు. ఆశ్రమ అధిపతి చిన్నిక్రిష్ణ సమక్షంలో కుటుంబ సభ్యులు జోగ ప్రవీణ్, జోగ రోజా, జోగ ప్రదీప్‌లు భోజన సౌకర్యాలు, వారికి అవసరమైన వస్తువులు అందించారు.

శ్యాంపురియా కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ


శ్యాంపురియా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామారావు

కవిటి: జిల్లా బెంతొరియా సంఘం మాజీ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్యాంసుందరపురియా ఇటీవల మృతి చెందారు. దీంతో అతని కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ నర్తు రామారావు పాతవరక గ్రామానికి శనివారం వెళ్లి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శ్యాంపురియా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ర్యాలీని విజయవంతం చేయండి


టెక్కలిపట్నంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస శాసనసభ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఈ నెల 22న నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని టెక్కలిపట్నం పార్టీ ఇన్‌చార్జి పానిల కృష్ణారావు కోరారు. ఈ మేరకు గ్రామంలో సర్పంచ్ పానిల పద్మావతితో కలిసి శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు.

సీఎం జగన్ హయాంలోనే సంపూర్ణ అభివృద్ధి


కవిటి: పెద్దకర్రివానిపాలెంలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేస్తున్న పిరియా విజయ

కంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం సంపూర్ణ అభివృద్ధి సాధించిందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సంక్షేమానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చిరునామాగా మారిందని పార్టీ ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పిరియా విజయ చెప్పారు. తలతంపర-1 సచివాలయం పరిధిలోని గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. అలాగే ఉపాధి వేతనదారులను కలిసి సీఎం జగన్ హయాంలో జరిగిన లబ్ధిని గమనించి మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా పేరాడ తిలక్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, స్థానిక సర్పంచ్ జగబంధు దొళాయి, ఎంపీటీసీ సభ్యుడు బృందావన్ సాహు, జామి జయ, గోకర్ణపురం సర్పంచ్ యారడి ఆనందరావు, పలికల జయరాం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దుర్గాసి ధర్మారావు, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

● వైఎస్సార్‌సీపీ గెలుపు ప్రజాక్షేమానికి పిలుపు


కవిటి: పెద్దకర్రివానిపాలెంలో ఇంటింట ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: వైఎస్సార్‌సీపీ గెలుపు ప్రజాక్షేమానికి పిలుపని పార్టీ ఇచ్ఛాపురం అభ్యర్థి పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. నియోజకవర్గంలో పార్టీ జెండాను ఈసారి రెపరెపలాడించాలని ఓటర్లను కోరారు. పెద్దకర్రివానిపాలెంలో ఎమ్మెల్సీ రామారావు, అభ్యర్థి పిరియా విజయ రెండు బృందాలుగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య, కడియాల ప్రకాష్, జల్లు యుగంధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ వై.నీలయ్య, పి.నీలాచలం, ఎన్ని అశోక్, ఎస్పీ నారాయణస్వామి, కాయ భీమసేన్, గండుపల్లి రమేష్, బాలయ్య, ఉప్పాడ శేషయ్య ఉన్నారు.


కంచిలి: తలతంపరలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న పిరియా విజయ

శిరీషకు దొరకని ప్రజాదరణ

● ఎన్నికల ప్రచారంలో మంత్రి సీదిరి అప్పలరాజు


కాశీబుగ్గ: మాట్లాడుతున్న సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న యార్లగడ్డ శిరీషకు ప్రజలలో ఆదరణ లేదని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 5, 6, 7, 8వ వార్డు పరిధిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా చినబడం, అంతరకుడ్డ, పెసరపాడు, నర్సిపురం, తాళ్లభద్ర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలాస నియోజకవర్గానికి గౌతు కుటుంబం ఏదైనా మంచిచేసి ఉంటే చెప్పాలని అన్నారు. తండ్రి, తాతల హయాంలో 60 ఏళ్లు పరిపాలించిన గౌతు కుటుంబం పలాస ప్రాంతానికి చేసింది శూన్యమన్నారు. అందుకే విసిగిపోయిన ప్రజలు శిరీషను కనీసం ఆదరించడం లేదని అన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో టీడీపీ 80 శాతం ఖాళీ అయిపోయిందని చెప్పారు. ప్రచారంలో ఏడో వార్డుకు చెందిన వలంటీర్ తేజేశ్వరి జగనన్నతోనే నా ప్రయాణం అంటూ రాజీనామా చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తీన్‌మార్ వాయిస్తూ స్టెప్పులు వేసి సందడి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు, సీహెచ్‌సీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, సీనియర్ హనుమంతు వెంకటరావుదొర, కౌన్సిలర్లు దువ్వాడ సత్యవతి, పిచ్చుకల అజయ్, కర్రి మాధవరావు, కో-ఆప్షన్ సభ్యుడు రోణంకి శ్రీనివాసరావు, బమ్మిడి సంతోష్, సురేంద్రనారాయణ త్యాడి, నాయకులు అట్టాడ ప్రసన్నకుమార్, రోణంకి శాంతికుమారి, తమ్మినాన శాంతారావు, గూన మన్మథరావు, బడగల బల్లయ్యనాయుడు

ఎన్నికల విధుల్లో అప్రమత్తం


మాట్లాడుతున్న నూరుల్ కమర్

టెక్కలి: ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ సూచించారు. టెక్కలిలో పీవో, ఏపీవోలకు శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఎన్నికల్లో కీలకంగా విధులను నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా అభ్యంతరాలకు తావివ్వకుండా విధులను నిర్వహించాలన్నారు. సహాయ రిటర్నింగ్ అధికారి బాలమురళీ కృష్ణ ఉన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు


కాశీబుగ్గ: రెస్క్యూ పరికరాలను తిలకిస్తున్న విద్యార్థులు

కాశీబుగ్గ: అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా పలాస అగ్నిమాపక కేంద్రంలో అగ్ని ప్రమాద సమయంలో మంటలను అదుపు చేసేందుకు వినియోగించే రెస్క్యూ పరికరాలను సిబ్బంది ప్రదర్శించారు. అగ్ని ప్రమాదాల నివారణ, పరికరాల వినియోగంపై వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం అధికారి సోమేశ్వరరావు, వివిధ కేటగిరీలకు చెందిన సిబ్బంది యుగంధర్, రమేష్‌నాయుడు, శ్రీనివాసరావు, జనార్దనరావు, మన్మథరావు, సంతోష్‌కుమార్, రాము, చిరంజీవి ఉన్నారు.

సోంపేట: అగ్ని ప్రమాదాలు సంభవించే సమయంలో అందరూ సామాజిక బాధ్యతగా భావించి నివారణ చర్యలు చేపట్టాలని సోంపేట అగ్నిమాపకశాఖాధికారి ఎస్.మోహనరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని కార్యాలయంలో నిర్వహించారు. అగ్నిమాపక శకటం, వివిధ పరికరాలు ప్రదర్శించి వాటిపై అవగాహన కల్పించారు. సిబ్బంది కె.భాస్కరరావు, డి.భాస్కరరావు, ఆర్.సింహాచలం, కె.వి.రమణ, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, స్వయంశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.


సోంపేట: పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


కోటబొమ్మాళి: అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలో అగ్నిమాపక అధికారి పి.ఆర్.రెడ్డి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు.

మధుబాబుకు ఘన సత్కారం


మధుబాబు దంపతులను సత్కరిస్తున్న వైద్యులు, విద్యావేత్తలు

పాతపట్నం: మండల కేంద్రంలోని బాలాజీనగర్‌కు చెందిన శాసనపూరి మధుబాబు విద్యారంగానికి చేసిన సేవలకు గోవా కేంబ్రిడ్జి డిజిటల్ యునివర్సిటీ ఇటీవల గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మధుబాబును పాతపట్నం విద్యావేత్తలు, వైద్యులు గూడేన సోమశ్వరరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ తూలుగు తిరుపతిరావు, బందన శ్రీనివాసరావు, బొయిన దాలిశెట్టి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఉన్న కల్యాణ మండలంలో మధుబాబు దంపతులను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాతపట్నం, హిరమండలం ఎంఈఓలు బి.శ్రీధర్, కె.రాంబాబు మాట్లాడుతూ మధుబాబు గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలను యువతతో ఏర్పాటు చేయించి, ఒక్కో గ్రంథాలయానికి రూ.10 వేల విలువైన పుస్తకాలు అందించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ప్రతి ఏడాది గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించి నగదు బహుమతులు అందజేశారన్నారు. పాతపట్నం పరిసర ప్రాంతాల్లో మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో శాసనపూరి మహేశ్వరరావు, సైకాలజిస్ట్ జి.రాజేశ్వరరావు, బి.శంకరనారాయణ, పి.అప్పారావు, నూలు బుజ్జి, నల్ల కుమారస్వామి, బందన వామన మురళి, కె.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురు చేరిక


పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న నాయకులు

కంచిలి: మండలంలోని నువాగడ గిరిజన పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ సీనియర్ నాయకులు, వారి కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. వీరికి స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షిలు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వీరు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరినట్లు వెల్లడించారు. పార్టీలో చేరిన వారిలో సీనియర్ నేతలు బినా బిసాయి, భుబుని బిసాయి, అప్పన్న బిసాయి, హరిశ్చంద్ర బిసాయిలు ఉన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సబితా గొమాంగో, ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యవతి పండా తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

టెక్కలి రూరల్: పోలవరం 11 కేవీ (ఇండస్ట్రీల్ ఏరియా) విద్యుత్ లైన్ల మరమ్మతులు అధికారులు చేపడుతున్నారు. దీంతో ఈ నెల 22వ తేదీన పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఈఈ జి.శంకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు టెక్కలిలోని మెళియాపుట్టి రోడ్డు, పాత ఎన్‌హెచ్-5, పలాస రోడ్డు తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సైనిక్‌స్కూల్‌కు యశ్వంత్ ఎంపిక


జీరు యశ్వంత్

కవిటి: జాతీయస్థాయిలో నిర్వహించిన సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో కవిటి మండలం ఆర్.బెలగాం గ్రామానికి చెందిన జీరు యశ్వంత్ ఎంపిక య్యాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో యశ్వంత్ 400 మార్కులకు 284 (3,759 ర్యాంకు) తెచ్చుకున్నాడు. ఓబీసీ కేటగిరీలో ర్యాంకు సాధించడంపై స్థానిక ఆర్‌కే మోడల్ స్కూల్ అధినేత పి.గురుమూర్తి విద్యార్థి ప్రతిభను కొనియాడారు. తల్లిదండ్రులది వ్యవసాయ కుటుంబం

క్వారీ చూసేందుకు వెళ్లి..


సుబోజి

టెక్కలి రూరల్: క్వారీ చూడటానికి వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయారని మద్దిలి వెంకటేష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేసినట్టు టెక్కలి పోలీసులు శనివారం తెలిపారు. లింగాలవలస గ్రామ సమీపంలోని క్వారీ చూసేందుకు హైదరాబాద్ గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన కాలే సుబోజి.. వెంకటేష్‌తో కలిసి వచ్చారు. క్వారీ యజమాని వేణుగోపాల్‌తో క్వారీని పరిశీలించిన సుబోజి కొంత సమయం తరువాత కిందికి వచ్చేశారు. సమీపంలో నిలిపి ఉంచిన కారు వైపు వెళ్లిన సుబోజీ తరువాత కనిపించలేదని వెంకటేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. ఫోన్ లిఫ్టు చేయకపోవడంతో వెతికినప్పటికీ కనిపించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆదిత్యాలయంలో ఆగ్నేయ స్థాలీపాక హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణం తర్వాత రోజు ఆచార వ్యవహారంగా నిర్వహించే ఆగ్నేయ స్థాలీపాక హోమం శనివారం ఘనంగా జరిగింది. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ మండపంలో అర్చకబృందం ఈ హోమాన్ని నిర్వహించారు. విశేష భోగాలను స్వామికి నివేదించారు. అంతకుముందు ఆదిత్యునికి ప్రత్యేక అర్చనలు చేశారు. ఉత్సవమూర్తులకు సహస్ర మండపంలో ఊయలలో కొలువుదీర్చగా భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వేద సత్కారం..

ఆదిత్యుని వార్షిక కల్యాణంలో భాగంగా ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సదస్యం, మహాదాశీర్వచనాలు, వేద సదస్సు, పండితుల సత్కారం తదితర కార్యక్రమాలు జరుగుతాయని ఈవో ఎస్.చంద్రశేఖర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు రథోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

26 నుంచి కల్యాణ వేంకటేశ్వరుడి వార్షికోత్సవాలు


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక కల్యాణ వేడుకలు ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆలయ ప్రాంగణంలో వార్షికోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26న ధ్వజారోహణం, 27న స్వామివారి కల్యాణం, 28న చక్రస్నానం, అన్నప్రసాద వితరణ జరుగుతుందని, భక్తులంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు బూరాడ వంశీకృష్ణమాచార్యులు, గౌరవాధ్యక్షులు ఎల్.నందికేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చూర్ణోత్సవ వేడుక


స్వామివారికి చూర్ణోత్సవం

శ్రీకాకుళం కల్చరల్:

నగరంలోని కోదండ రామాలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా శనివారం చూర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి నిత్య కైంకర్యాల అనంతరం నూతన వస్త్రాలతో అలంకరించారు. రంగులు జల్లి చూర్ణోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ రెండో వార్డు జయరామచంద్రపురం గ్రామంలో శనివారం కొట్లాట చోటు చేసుకుంది. పాత తగాదాల్లో భాగంగా రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణ ఆఖరికి కొట్లాటకు దారి తీసింది. గ్రామానికి చెందిన బద్రి దుర్యోధన కుటుంబ సభ్యులపై బొల్ల భాస్కరరావు, బద్రి శ్రీకాంత్‌లు దాడి చేసి తీవ్రంగా గాయపరిచి, హత్యాయత్నానికి పాల్పడినట్టు బాధితుల తరఫున బద్రి ధర్మారావు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పారినాయుడు హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు

ఆర్థో వైద్యుడిపై దాడి

● కారు అద్దాలు ధ్వంసం


దాడిలో ధ్వంసమైన కారు అద్దాలు

టెక్కలి రూరల్: టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్థో వైద్యుడిగా పనిచేస్తున్న రాజేష్‌పై శనివారం అర్ధరాత్రి సమయంలో కొంతమంది దుండగులు దాడికి పాల్పడ్డారు. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. డాక్టర్ రాజేష్‌కు టెక్కలి సమీపంలో ఒక స్థలం ఉందని, దానికి సంబంధించి గత కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. శనివారం పోలీసులను కలిసి తిరిగి తన స్థలం మీదుగా శ్రీకాకుళం వెళ్తుండగా కొంతమంది వ్యక్తులు ఆ సైటు వద్ద డాక్టర్ కారు ఆపారు. కారులో ఉన్న డాక్టర్‌ను బయటకు దించి, కారు అద్దాలు బద్దలుగొట్టి గొడవకు దిగారు. అంతటితో ఆగకుండా దాడి చేయడంతో అతను భయపడి సమీపంలోని ఇంట్లోకి వెళ్లి దాక్కున్నట్లు చెప్పారు. దీంతో దుండగులు కారులో ఉన్నటువంటి స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లతో పాటు కొంత మొత్తం నగదును తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం సమాచారం అందుకున్న ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకుని డాక్టర్‌ను టెక్కలి ఆస్పత్రిలో చెర్చారు. పోలీసులకు వైద్యుడు రాజేష్ ఫిర్యాదు చేశాడు.